ఇంతలో రోజా మొగ్గ బుట్టలకెత్తే నౌకర్లుకాకుండా, ప్రెసిడెంటుగారి నౌకర్లు వచ్చారు.

'వచ్చారా! యీయాల్టిమొత్తం మొగ్గది. అట్టుకెళ్ళండి.' అన్నాడు చినకాపు.

ప్రెసిడెంటుగారి నౌకర్లు మొత్తం మొగ్గని బుట్టల్లోకెత్తుతున్నారు.

సీత నోరు మెదపకుండా చూస్తూ బొమ్మల్లెనుంచుంది. మొగ్గలిస్తానని దగాచేసి నందుకు చినకాపునిచూస్తే వళ్లు మండిపోతోంది సీతకి.

'ఎన్నాళ్లబట్టో పువ్వులజడకోసం సరదాపడ్డాను. అడిగినదానికంటే ఎక్కువ మొగ్గ యిత్తానని మాటిచ్చావు. చివరకిలా మాటతప్పుతావా? నువ్వు రెండునాలికల మనిషివి.' అని ముఖానకొట్టినట్టు అనాలనుకుంది సీత.

వచ్చినవాళ్లు పూల బుట్టలట్టుకొని వెళ్ళిపోయారు.

అంతలోనే చినకాపు సీతనిచూసి, 'అయ్యో! నీ సంగతే మరచిపోయానే. అతల పెసిడెంటు గోరమ్మాయి పెళ్లని కబురొచ్చింది. వున్నమొగ్గంతాంపమన్నారు; పూల కారు కడతారట, పూలమండపంకడతారట, మరికాదంటె బాగోదుసూడు. ఈ పాలెప్పు డేనా పట్టుకెడుదువుగానిలే' అని వెళ్ళిపోయాడు చినకాపు.

'మాలాంటోళ్ల కిచ్చిన మాట తప్పినాపరవాలేదులే. పెద్దోళ్ళకిచ్చిన మాట తప్పకు. మాదేవుంది? మా కోరికలదేవుంది? సిన్నోళ్ళం.' అనుకుని సీత దిగాలుపడి, అడుగులో అడుగేసుకుంటూ యిల్లుచేరింది పట్టిచేతులతో.

పెళ్లి జరిగిపోయింది. యివతలవీధిలో సీతపెళ్లి, అవతలవీధిలో ప్రెసిడెంటు గారమ్మాయిపెళ్లి ఒకే ముహూర్తానికి జరిగిపోయాయి. ఆరోజున వూళ్లోని పువ్వులన్నీ ప్రెసిడెంటుగారింటికే వెళ్లాయి.

సీత సాదాజడ వేసుకుంది, సాదాపల్లకీలో పెళ్లికొడుకుతో కలసి ఎక్కింది. యిరుగుపొరుగు పిల్లలు సరదాపడి, సీతముందు కొందరు పెళ్లికొడుకుముందు కొందరు కూర్చున్నారు. పల్లకీముందు వూళ్లోని భజంత్రీలు. పిల్లసనాయి, డప్పులమేళం వున్నాయి. రెండు పెట్రోమాక్సులైట్లు– పల్లకిదగ్గరొకటి డప్పులమేళందగ్గరొకటి పట్టు కుని వాళ్లవాళ్లే నిలబడ్డారు.

పెళ్లిజరుగుతున్నా మనసులోని తీరనికోరిక, జరిగిన అవమానం సీతమనసుని కుమ్మరిపురుగులా దొలుస్తూనేవున్నాయి.

వాళ్లవీధంతా వూరేగి పెద్దవీధిలోకి వూరేగింపు మళ్లబోతోంది. 'ఆగండి, యీతసెట్టు కాలుత్తున్నారు.' అని అరచారెవరో.

